
## సిపాయి కథలు

# ఆపరేషన్ విజయ్

అది యుద్ధరంగంలోని 'ద్రాస్' సెక్టర్.

అక్కడ ఒక తాత్కాలిక సైనిక ప్రధాన కార్యాలయం ఏర్పాటయింది. యుద్ధరంగంలో అలాగే ఉంటుంది... స్థావరాలు మారకపోవచ్చు గానీ, వాటిని అజమాయిషీ చేసే కార్యాలయాలు అవసరాన్ని బట్టి మారుతుంటాయి. లేకపోతే, గూఢచారుల ద్వారా వాటి స్థానం తెలుసుకుని, గురిగా వాటిమీద ఫిరంగి గుళ్లు ప్రయోగిస్తారు శత్రువులు. కార్గిల్ యుద్ధంలో ఈ విధంగా కోట్లాది రూపాయల మందుగుండు సామాగ్రి, వాహనాలు శత్రువు ఫిరంగి గుళ్లకు ధ్వంసమైనాయి. అందువల్ల వ్యూహాత్మకంగా సైనిక కార్యాలయాల స్థలాలు మార్చటం అనివార్యమైంది. న్యాయంగా అయితే, సైనిక స్థావరాల ప్రాంతాల్లోకి ఎవర్నీ అనుమతించకూడదు. కానీ, స్థానికుల కదలికలు నిషేధించటం వల్ల పౌరజీవితం స్తంభిస్తుంది. అందువల్ల పరిమితంగా అనుమతిస్తారు. గూఢచారులు స్థానికులతో కలిసిపోయి



విద్రోహచర్యలు చేపడుతుంటారు. ఎంత జాగ్రత్తగా ఉన్నా శత్రువులకి సమాచారం అందకుండా పూర్తిగా నిరోధించడం అంత సులభం కాదు. మనక్కూడా గూఢచారుల ద్వారా ముఖ్యమైన సమాచారం అందుతూనే ఉంటుంది. ఇదంతా వ్యూహంలో భాగం.



కార్గిల్‌లో కొన్ని శత్రుస్థావరాలు మనవశం కావటానికి కొందరు సైనికులు బలికాక తప్పలేదు. 18 గ్రెనెడియర్స్‌కు చెందిన భారత సైనికుడు చూస్తుండగానే పై అధికారి మేజర్ రాజేశ్ అధికారి శత్రుసైనికుడి చేతిలోని A.K-47 తూటాకి బలి అయ్యాడు. 18వ గడ్వాల్ దళానికి చెందిన ఇరవై ముగ్గురు వీరజవాన్లను పోగొట్టుకున్న బాధ, 2వ రాజ్‌పుటానా రైఫుల్స్‌కి చెందిన సాహసవీరుల త్యాగాలు, భారతసైనికులను తడి ఆరని గాయంలా బాధిస్తోంది.

శత్రుస్థావరంలో విగత జీవుడైన శత్రు సైనికుడ్ని తాత్కాలిక సైనిక ప్రధాన కార్యాలయం దగ్గర చెట్టుకు వ్రేలాడదీసారు కొందరు జవానులు. భారత సైనికుల కళ్లుపెరికి, అవయవాలు ఖండించిన శత్రుసైనికుల దౌష్ట్యానికిది సమాధానం కాదు కానీ, అంతకంటే తీవ్రంగా చేయలేని సంస్కారం మన సైనికులది. ఆ శత్రు సైనికుడి మృతదేహం చూస్తూ కొందరు సైనికులు తదుపరి పోరాటానికి స్ఫూర్తి పొందుతున్నారు. మరికొందరిలో సమరోత్సాహం ఉరకలు వేసింది. చివరకు వారు ఆ శత్రుసైనికుని మృతదేహాన్ని పాతిపెట్టి, ఖననస్థలాన్ని సూచించడానికి జెనీవా తీర్మానం ప్రకారం పటంలో ఓ గుర్తు పెట్టారు. ఇప్పటి వరకు 439 మందికి పైగా శత్రుసైనికులు ఈ యుద్ధంలో హతమయ్యారు.





కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

కార్గిల్ ప్రాంతంలోని ఆ సమున్నత శిఖరాల గొప్పదనాలు, సంతోష సమయాలు అట్టే సేపు నిలవవు. 18వ గ్రెనెడియర్స్ దళం దాదాపు 20 రోజులు పోరాటం జరిపి, హంప్‌గుట్టనీ, పాయింట్ 4590 శిఖరాన్ని చేజిక్కించుకుంది. కానీ, ఆ రెండు దళాలకూ ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. టైగర్‌హిల్‌కి దారితీసే కొండ ప్రాంతాల నుంచి శత్రువుల్ని తరిమి కొట్టాల్సిందిగా వారికి మరో బృహత్తర కార్యక్రమం అప్పగించారు. వారు ఎలాగైతేనేం అక్కడ 'భారత్ మాతాకీజై' అన్న నినాదాలు విన్పించేలా చేయగలిగారు. కానీ, ఆ విజయోత్సాహం పూర్తిగా చల్లారక ముందే వారంతా మరో కార్యసాధనలో పడ్డారు. మరో కొత్తశిఖరం... మరో కొత్త పోరాటం - నినాదాలు మాత్రం అవే... మరింత ప్రాణనష్టం... టైగర్‌హిల్ స్వాధీనానికి పోరు ఇంకా ప్రారంభం కాకముందే 18వ గ్రెనెడియర్స్ 25 మంది జవాన్లను కోల్పోయింది. మరి 42 మంది గాయపడ్డారు. పాయింట్ 5100 శిఖరం స్వాధీనానికి 2వ రాజ్‌పుటానా రైఫుల్స్ ముందుకు ఉరికిన రాత్రి ముగ్గురు అధికారులు, 12 మంది జవాన్లు పోరులో హతమయ్యారు. ఇంతవరకు కార్గిల్ పోరులో 210 మంది భారతీయ జవాన్లు మరణించారు. 389 మంది గాయపడ్డారు. తొమ్మిదిమంది జాడ తెలియటంలేదు. బహుశ: వారిని శత్రువులు పట్టుకుని ఉంటారు. ఆపరేషన్స్ పర్యవేక్షిస్తున్న బ్రిగేడియర్ "శత్రువును ఇంకా 30 స్థావరాల నుంచి వెళ్లగొట్టాల్సి ఉంది" అన్నారు విలేఖరులతో.

పాయింట్ 5140 శిఖరంపై ప్రస్తుతం భారతపతాకం ఎగురుతున్నప్పటికీ ఇప్పటికీ పాకిస్తాన్ ఫిరంగి కాల్పుల్లో మన సైనికులు గాయపడుతూనే ఉన్నారు. ఈ శిఖరంపై జరిగిన

## సిపాయి కథలు

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ *1964* నుంచి *1980* వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేకమంది యుద్ధ వీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

దాడిలో హతుడైన మన సైనికాధికారి మృతదేహాన్ని ఒకమందు పాతరతో అనుసంధించి మరీ శత్రువు పలాయనం పఠించాడు. ఆ దేహాన్ని అక్కడి నుంచి తొలగించాలని ప్రయత్నించిన జవాను మందు పాతర పేలుడులో కాలు పోగొట్టుకున్నాడు. అటుపైన పాయింట్ 5100 స్వాధీనానికి జరిపిన పోరాటంలో భారతసైన్యం భారీ నష్టం చవిచూసింది. ఈ శిఖరం పైనుంచి శత్రువులు ఏకకాలంలో 13 యూనివర్సల్ మరతుపాకులతో కాల్పులు జరపటంతో మన సైనికులు పెద్దసంఖ్యలో హతులయ్యారు. సాధారణంగా రెండు మూడు మరతుపాకులను మాత్రమే శత్రువులు ఉపయోగిస్తుంటారు.

దానికి జవాబుగా శిఖరంమీదకు భారత సైన్యం ఏకకాలంలో 120 బోఫోర్స్ శతఘ్నులను పేల్చి వాళ్లను చావుదెబ్బ తీసింది. టైగర్ హిల్ మీదకూడా అలాంటి గడ్డు పరిస్థితిని

ఎదుర్కొనేందుకు 140 బోఫోర్స్ శతఘ్నులను ప్రయోగించటం జరిగింది.

యుద్ధరంగం పరిస్థితి ఇలా ఉంటే - యుద్ధ తంత్రంలో తలమున్కలుగా ఉన్న కమాండర్లు, యుద్ధభూమికి దూరంగా సమీక్షా సమావేశంలో ఉన్నారు.

* * *

"మిత్రులారా! కార్గిల్ యుద్ధంలో మనం పూర్వం ఎన్నడూలేనంతగా ప్రాణనష్టం గమనిస్తున్నాం. దీని గురించి మనం చర్చిస్తే బావుంటుంది" సీనియర్ కమాండర్ జస్జీత్‌సింగ్ తన సహచరుల్ని ఉద్దేశ్యించి అన్నాడు.

"నిర్మొగమాటంగా చెప్పమంటారా?" ఒక కమాండర్ అడిగాడు.

"చెప్పండి. అదే నేను కోరేది..."

"ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు సైనిక వ్యయాన్ని ఒక పద్ధతి ప్రకారం తగ్గిస్తున్నాయి కదా అని, అవసరానికి మించి మనదేశం రక్షణ వ్యయంలో కోత విధించింది..."

"అది ప్రభుత్వం విధానం! మనం చెయ్యగలిగిందేమీ లేదు..."

"డియర్ సర్! కేవలం 50 కోట్ల ఖర్చుతో కార్గిల్ యుద్ధంలో ఉన్న మన సైనికులకు చీకట్లో చూడగల పరికరాలు, కమాండో పరికరాలు మంచులో తిరగగలిగిన వాహనాలు, రాకెట్, గ్రెనెడ్ లాంచర్లు లభ్యమైఉండేవి. ఇవి శత్రువుల వద్ద సమృద్ధిగా ఉన్నాయి. మనకి లేవు..."

"మిత్రమా! అక్కడ సైనిక ప్రభుత్వం ఉంది. నిర్ణయాలకు ఆలస్యం ఉండదు. మనది ప్రజాప్రభుత్వం. ఆ విషయం మర్చిపోకూడదు."

"సార్! యుద్ధరంగం మీద నిఘా ఉంచేందుకు కావాల్సిన వ్యవస్థగానీ, తుపాకులను గుర్తించే రాడార్లు, స్వయంచలిత తుపాకులు, ఆధునిక కమ్యూనికేషన్ పరికరాలూ - ఇవేమీ లేకుండా సైన్యం ఏమి అద్భుతాలు చేయగలదు. మీరే చెప్పండి?" మరో కమాండర్ ఆవేదనగా అన్నాడు.

"మీ ఆవేదన నేను అర్థం చేసుకోగలను. ప్రతియుద్ధమూ కొన్ని పాఠాలు నేర్పుతుంది. సమస్యలు ఎదుర్కొన్నప్పుడే లోటుపాట్లు తెలుస్తాయి..." ఆయన ఒకసారి గట్టిగా నిట్టూర్చి "మిత్రులారా! మన యుద్ధనినాదం - 'ఆపరేషన్ విజయ్'. మనం తప్పక విజయం సాధించితీరతాం. మన సైనికుల త్యాగాలు వ్యర్థం కావు. జరిగింది ప్రస్తుతానికి వివరిద్దాం. జరగవలసినది సమర్థవంతంగా చేద్దాం. మీమీ దళాలకు ప్రోత్సాహాన్నీ, స్ఫూర్తినీ కలిగించండి. తమ ప్రాణాలు కాపాడుకుంటూ, శత్రువులను తరిమికొట్టే విధంగా ఎవరికి వారు అప్పటి పరిస్థితుల కనుగుణంగా వ్యూహరచన చేసుకోమనండి..."

"అలాగే సార్" కమాండర్లు శాల్యూట్ చేసారు.

"విజయం మిమ్మల్ని వరించుగాక! జైహింద్..."

"జైహింద్"

* * *

కాలచక్రం ఎవరికోసమూ ఆగదు.

జరిగిన సంఘటనలన్నీ ఒకమాటు సింహావలోకనం చేసుకుంటే - 1999 మే 8 నుంచి 15 తేదీల మధ్య కార్గిల్ పర్వతాలలో చొరబాటుదారులు స్థావరాలు ఏర్పరచుకోవటం ప్రారంభమైంది. కార్గిల్-ద్రాస్-బటాలిక్ సెక్టార్లలో శత్రు

వులు ఏర్పరచుకున్న స్థావరాల పై భారత వైమానిక దళం మే 26వ తేదీన దాడులు ప్రారంభించింది. మే 27వ తేదీన మిగ్-27 ప్రమాదవశాత్తు కూలిపోయింది. మిగ్-21 విమానాన్ని శత్రువులు కూల్చేసారు. మే-28న మిగ్-17 హెలికాప్టర్‌ని కూడా శత్రువులు కూల్చేసారు. జూన్ 6 నుంచి భారతసైన్యం భారీగా దాడులు ప్రారంభించింది. వైమానిక దళం శత్రువును తమ దాడులతో ఉక్కిరిబిక్కిరి చేసింది. జూన్ 10వ తేదీన చిత్రవధచేసిన జాట్‌రెజిమెంట్ సైనికుల మృతదేహాలను మనకి అప్పగించారు. దేశం ఆగ్రహంతో ఊగిపోయింది. జూన్ 13న కీలకమైన తోలోలింగ్ శిఖరం మన వశమైంది.

మరోప్రక్క ప్రపంచదేశాల మద్దతుకోసం భారత్ చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలనిచ్చాయి. అమెరికా, జి-8 దేశాలు పాకిస్తాన్ మీద తీవ్రవత్తిడి తెచ్చి సైన్యాలను కార్గిల్ నుంచి ఉపసంహరించుకోమని గట్టిగా చెప్పాయి.

శత్రువు చుట్టూ దౌత్యపరమైన ఉచ్చు బిగిసింది.

జులై 4న టైగర్‌హిల్‌ని భారతసేనలు వశం చేసుకున్నాయి.

జులై 11వ తేది వచ్చేసరికి పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు కాలం వేగంగా ముందుకు పరుగెత్తినట్లుంది.

'ఆపరేషన్ విజయ్' - విజయవంతమైంది!

కార్గిల్ నుంచి శత్రువుల ఉపసంహరణ ప్రారంభమైంది.

బటాలిక్‌లోని కీలక శిఖరాలు భారత్ వశమయ్యాయి. సంపూర్ణ ఉపసంహరణకు జులై



హైదరాబాద్ శ్రీ త్యాగరాయగానసభ, మానస ఆర్ట్ థియేటర్స్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన సభలో 'మలయశ్రీ కవిత్వం - పరిశీలన' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో పల్లెర రాంమోహన్‌రావు, రఘుశ్రీ, డా॥ పాండయ్య, డా॥ మలయశ్రీ, డా॥ శ్యాంప్రసాద్, డా॥ చుక్కా రామయ్య, డా॥ శ్యాంసుందర్, ననుమాసస్వామి ఉన్నారు.

16వ తేదీ వరకు గడువు ఇవ్వటం జరిగింది. జులై 14వ తేదీన 'ఆపరేషన్ విజయ్ సక్సెస్' అంటూ ప్రధాని వాజ్‌పేయి ప్రకటించటంతో కథ సుఖాంతమైంది.

కానీ, జాతి రక్షణకోసం రక్తం చిందించిన వీరసైనికుల్ని మనం మర్చిపోకూడదు. వారు వీరస్వర్గమలంకరించినా, వారి ఆత్మలు మళ్లీ మరోజన్మతో ఈ పవిత్ర భారతదేశంలో జన్మించి, దేశరక్షణలో పునీత మయేందుకు తహతహలాడుతున్నాయి. వారెవరంటే – మేజర్ మారియప్పన్ శరవణన్, కెప్టెన్ పి.వి. విక్రమ్, లెఫ్టినెంట్ కల్నల్ ఆర్. విశ్వనాధన్, నాయిబ్ సుబేదార్ లాల్‌సింగ్, గ్రెనెడియర్ అమర్‌దీప్, హవల్దార్ పద్మసింగ్ ధమ, హవల్దార్ జైప్రకాశ్ సింగ్, గ్రెనెడియర్ మోహన్‌కథా, రైఫుల్‌మాన్ సునీల్ జంగ్ట్ మహట్, రైఫుల్‌మాన్ షౌకత్ హుసేన్ కాల్లం, లాన్స్‌నాయక్ గుర్మైల్‌సింగ్, హవల్దార్ తన్ బహదూర్‌ఛెత్రి, నాయక్ ధరమ్ సింగ్, లాన్స్‌నాయక్ బిజేంద్రసింగ్, రైఫుల్ మాన్ దిల్వార్‌సింగ్, నాయక్ సుబాబ్‌సింగ్, రైఫుల్‌మాన్ బల్బీర్‌సింగ్, సిపాయ్ సురేశ్ కుమార్, నాయక్ బీరేందర్ సింగ్, సిపాయ్ ప్రమోద్‌కుమార్, నాయక్ మేఘ్‌బహదూర్... ఇంకా... సిపాయిలు అరవిందకుమార్ పాండే, జోహార్‌సింగ్, రాజ్‌కుమార్, రాకేశ్ చంద్, శ్రావణ్ కుమార్, శివ వానయ్య, చరానికొలస్, బాజీందర్‌సింగ్, సుఖ్వీందర్ సింగ్, మునీష్ కుమార్, సెవాంగ్ రిగ్జిన్, ఏకనాధ్ చైత్‌రామ్, రాజన్‌సాహు, కేవల్ ఆనంద్, సముందర్ సింగ్, ఖేమ్‌రాజ్, సత్నాం సింగ్, గణేశ్ ప్రసాద్‌యాదవ్, ఇంకా...ఇంకా ఎందరో... ఎందరెందరో... అందరికీ నివాళిగా అశృతర్పణం తప్ప ఇంకేమి ఇవ్వగలం?

* * *

ఎన్నో ఎదురుదెబ్బలు తట్టుకుని 74 రోజుల పాటు భీకరంగా పోరాటం జరిపిన భారత సైన్యానికి వాస్తవాధీన రేఖ వద్ద పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవడమే తక్షణ కర్తవ్యంగా తయారయింది.

శత్రువులు వాస్తవాధీన రేఖ పొడవునా, 150 కిలోమీటర్ల మేర చొచ్చుకు రావడం ఫలితంగా, ఇప్పుడక్కడ అయిదు బ్రిగేడ్ల సైన్యం నిరంతరం పహరా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొండల మీద 20 అడుగుల ఎత్తున మంచు పేరుకుంటుంది గనుక సెప్టెంబరు కల్లా అక్కడ ఆహారపదార్థాలను నిలువ చేసుకుని చలికాలమంతా గడపాలి. అలోగా కొత్త ఆయుధాగారాలు, బంకర్లు, కంచరగాడిదలకు దారులు సిద్ధంచేసుకోవటం – ఇలా కార్గిల్‌క్షేత్రంలో సైనిక సంచలనం అలా ఉంటూనే ఉంటుంది. ఋతువులు మారతాయి. కానీ, అక్కడి సైనికుల బాధ్యతలు మారవు. భారతీయులలో అంతర్లీనంగా ఉన్న సమైక్యతా భావాన్ని ప్రోదిచేసిన కార్గిల్ విజయాన్ని మనసులో పెట్టుకుంటూ భద్రతను ఉపేక్షిస్తే దేశం ఎంత మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందో గుర్తుంచుకోవాలి.

చరిత్ర నిర్వికార దృక్పధాన్ని కోరుతుంది. రానున్న కాలంలో కార్గిల్ సంఘటనలు క్రమంగా మరుపుకు రావొచ్చు.

కార్గిల్‌శిఖరాల మీద మున్ముందు కురిసే మంచు హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులు, పంజాబీలు, గూర్ఖాలు, బీహారీలు, నాగాలు, ఒరియాలు, బెంగాలీలు, తెలుగువారు, తమిళులు, కన్నడిగులు, మళయాళీలు చిందించిన రక్తాన్ని కప్పుతుంది. వారందరి త్యాగం వల్లనే కార్గిల్ దేశానికి తిరిగి దక్కింది. కార్గిల్‌ని స్ఫూర్తిగా తీసుకుంటూనే, దానినొక హెచ్చరికగా కూడా గుర్తుంచుకోవాలి. ●